చెక్కును పంపిణీ చేసిన సర్పంచ్


చెక్కును అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామానికి చెందిన నీరెడి వినయ్‌కుమార్‌కు రూ.40వేల సీఎం సహాయనిధి చెక్కును సర్పంచ్ పార్ధ వాణి సాయిరెడ్డి అందజేశారు. వినయ్‌కుమార్ ఆసుపత్రి శిక్షణ నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆమేర్ సహకారాలతో ఈ చెక్కును అందజేసినట్టు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్, సాయిరెడ్డి తదితరులున్నారు.

అణగారిన జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

బుధవారం 15 ఫిబ్రవరి 2023

బీసీ హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-భిక్కనూర్



మండల కేంద్రంలో స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి యేమిమా మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అనారోగ్య సమస్యలు తలెత్తితే స్థానిక ఆసుపత్రిలో నిర్లక్ష్యం చేయకుండా చూయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమున్నవారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిని సునీత, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, ఏఎన్ఎం శ్యామల, ఆశావర్కర్ రేణుక విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ


పుస్తకాలను వితరణ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని గ్రంథాలయానికి ముగ్గురు దాతల సాయంతో రూ.20వేలతో పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రంథాలయం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని, గ్రంథాలయానికి దోమకొండ గ్రామంలోని దాతలు అభ్యుదయ పాఠశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్ ఎండపల్లి నవీన్ కుమార్, ఆర్ఎంపీ డాక్టర్ సాయబ్‌గారి రాజులు రూ.20వేల విలువగల పోటీ పరీక్షల పుస్తకాలను అందజేయటం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా దాతలను గ్రంథాలయం సంస్థ చైర్మన్, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగ్ర మధుసూధన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, ఏఎంసీ డైరెక్టర్ పోచయ్య, బీఆర్ఎస్ యూత్ విభాగం మండలాధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, నాయకులు పున్న లక్ష్మన్, చిన్నగారి నర్సింలు, విజయ్, లైబ్రేరియన్ కపిల్, గ్రూపు పరీక్షల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-సదాశివనగర్/ఎల్లారెడ్డి

మోడల్ స్కూళ్లలో ఆరో తరగతితోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు ఈ నెల 22 వరకు పొడగించినట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. ఆరో తరగతిలో వంద సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఓసీలు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. ఇతర వివరాల కోసం www. tsmod-elschools.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

22 వరకు ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల గడువు..

ఎల్లారెడ్డి : ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో ప్రవేశాలకు 22వ తేదీ వరకు తుది గడువు ఉందని ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ ఈనెల 22న చివరి తేదీన ముగింపు అని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. కాగా ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అందుకుగాను http://telanganams.cgg. gov. In వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నేడు బిచ్కుందలో నాలుగు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులకు భూమిపూజ



నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం సెంట్రల్ లైటింగ్ పనులకు రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖ మాత్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, జిల్లా పరిషత్ చైర్మన్ దాఫేదార్ శోభ రాజు, జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హన్మంత్ షిండే, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 10 గంటలకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించనున్నట్టు వివరించారు. అనంతరం మున్నూరు కాపు సంఘం కళ్యాణ మండపంలో బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పట్టణంలో అక్రమంగా కూల్చివేతలు సరికాదు

- మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలో మురికి కాల్వల నిర్మాణం కోసం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేయడం సరి కాదని మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాది గజ్జల బిక్షపతి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మురికి కాలువల నిర్మాణం కోసం మొదటగా గ్రామసభ నిర్వహించాలని, గ్రామసభలో కనీసం 500 మంది హాజరుకావాలని, మెజార్టీ గ్రామస్తుల తీర్మానం మేరకు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు. మురికి కాల్వల నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న వారితో సమావేశం నిర్వహించకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు సరికాదని, దీనిపై ఈవో, జిల్లా కలెక్టర్ వరకు బుధవారం వినతిపత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. చట్టం ప్రకారం పంచాయతీ కార్యదర్శి ముందస్తుగా నోటీసులు జారీ చేయకుండా పాలకవర్గ సభ్యులు దగ్గర ఉండి కూల్చివేస్తున్నారని, కూల్చివేతతో నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్టు బాధితుల పక్షాన న్యాయపోరాటం చేస్తానన్నారు.

జలాల్‌పూర్‌లో నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలోని జలాల్‌పూర్ గ్రామంలో ఎంపీడీవో బషీరుద్దీన్ నర్సరీలో మొక్కలను మంగళవారం పరిశీలించారు. అవెన్యూ ప్లాంటేషన్, హరితహారం మొక్కల పెంపుదలకు వాడుతున్న మట్టిని, మొక్కలకు నీటిని పట్టే విధానాన్ని, అవెన్యూ ప్లాంటేషన్ మొక్కల ఎదుగుదలను ఆయన స్థానిక సర్పంచ్ అనిత వెంకట్‌గౌడ్‌ను పరిశీలించారు. రాబోయే ఎండలలో మొక్కలు ఎండకుండా పెంచే మొక్కలను రక్షిస్తూ ఎదిగిన మొక్కలను కూడా రక్షించాలని పంచాయతీ సెక్రెటరీకి సూచించారు. అనంతరం ఎస్ఎన్‌పురం గ్రామ పంచాయతీ పరిధిలో గల రైతువేదికలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇంతవరకు ప్రజలకు చేసిన పరీక్షలను అందించిన కంటి అద్దాలను, మందులను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీఓ, చందూర్ గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు తదితరులున్నారు.

దళారుల దోపిడీతో

పసుపు రైతులకు తీవ్ర నష్టం

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్
- మార్కెట్ సందర్శన
- రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న నాయకులు


మార్కెట్‌లో పసుపు పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పసుపు మార్కెట్‌లో దళారుల దోపిడీతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ముఖ్యమంత్రి, మంత్రులు నిరంతరం మార్కెట్లను పర్యవేక్షించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. మంగళవారం ఆయన నిజామాబాద్ మార్కెట్‌ను సందర్శించి పలువురు పసుపు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శోభన్ విలేకరులతో మాట్లాడుతూ.. మార్కెట్‌లో పసుపునకు సరైన ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రయివేటు వ్యాపారులు పసుపు క్వింటాలుకు రూ.5వేల నుంచి 5,675కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం.. పసుపు క్వింటాలుకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తూకాలలో తేడాలు ఉన్నాయని విమర్శించారు. మార్కెట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు పసుపు రైతుల్లో అవగాహన పెంచాల్సి ఉందని శోభన్ అన్నారు. దుంప కుళ్లు తెగుళ్లు వచ్చి దిగుబడి తగ్గిందని, రైతులు ఎకరాకు లక్షన్నర పెట్టుబడి పెట్టిన దానికి తగినట్టుగా దిగుబడి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో రైతులకు ఐదు రూపాయలకే భోజనం అందించాల్సి ఉన్నా దాన్ని నిలిపి వేశారని తెలిపారు. భోజన పథకాన్ని మరల ప్రారంభించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు రైతుల సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలమయ్యాయని, పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ఐదు రోజుల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని బాండ్ పేపర్లపై రైతాంగానికి రాసిచ్చినా.. నేటికీ అమలు కాలేదని అన్నారు. మార్కెట్లను సందర్శించి రైతులకు మద్దతు ధర వచ్చేలా చేయడంలో ఎంపీ అరవింద్, సీఎం కేసీఆర్, మంత్రులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని అన్నారు. ఇప్పటికైనా మార్కెట్లను పర్యవేక్షించి రైతులను ఆదుకోవాలని కోరారు. మార్కెట్‌లోని సమస్యలను మార్కెట్ కార్యదర్శి వెంకటేశంకు వివరించారు. పసుపు ఎక్స్‌పోర్టు లేదని, పాత స్టాక్ ఇంకా గోడౌన్‌లో మిగిలిందని, ఇతర రాష్ట్రాల్లో పసుపు పంట వేయడం వల్ల పసుపు రేటు తగ్గుతుందని మార్కెట్ కార్యదర్శి అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరప్ప, జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తొగటి భూమన్న, దేవేందర్ సింగ్, సహాయ కార్యదర్శి నీరడి గంగామణి, రైతులు తంబూరి మల్లేష్, ఎస్ గంగారాం, నర్సయ్య, బాలకృష్ణ, గడ్డం కృష్ణన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటుకు ధీటుగా

ప్రభుత్వ కళాశాలలు సత్ఫలితాలు సాధించాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో అదనపు కలెక్టర్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలు సత్ఫలితాలు సాధించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే హాజరై మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతులు కల్పించిం దని, అనుభవ జ్ఞులైన అధ్యాపకులతో బోధన చేపడుతుందని తెలిపారు. ప్రస్తుతం కళాశాలలో 580 మంది విద్యార్థులు ఉన్నారని, వారి సంఖ్యను 900 అయ్యే విధంగా అధ్యాపకులు చూడాలని చెప్పారు. విద్యార్థులకు కష్టపడేతత్వం ఉంటే విజయం సాధించడం సులభం అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థి దశలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం మార్కులు కీలకమైనవని, విద్యార్థులు భావించాలని సూచించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. లక్ష్యసాధన కోసం పట్టుదలతో ఇష్టపడి సాధన చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ అధికారి షేక్ సలాం మాట్లాడారు. తమ కళాశాలలో ఒకేషనల్ కోర్సులు ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కళాశాల నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నియంత్రణ కమిటీ ప్రతినిధులు అజ్మల్ ఖాన్, నిజాం, ప్రిన్సిపాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

అంగన్వాడీల సమస్యల పరిష్కరించమంటే ముందస్తు అరెస్టులా..?

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ కె.చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్


అరెస్టయిన కె.చంద్రశేఖర్

అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించమంటే ముందస్తు అరెస్టులు చేసి నిర్బంధిస్తుందని.. ఇది ప్రజాస్వామ్యం విరుద్ధమని పోరాటం చేసే హక్కు ప్రతి మనిషికి ఉంటుందని ముందస్తు అరెస్టుల ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అంగన్వాడీ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన


రుత్విక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట్, కొన్నపూర్ తాండ, సురాయిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే జాజాల సురేందర్ పలు బాధిత కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. పొల్కంపేట్ గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ స్టూడెంట్ మర్రి రుత్విక్ కొన్నిరోజుల క్రితం రోడ్డుప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు మల్లేశం, రాణిని పరామర్శించి ఓదార్చారు. అలాగే అదే గ్రామంలో 15 రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన గురుడు లచ్చవ్వ, కుటుంబ సభ్యులు బాల గౌడ్, నరేష్‌గౌడ్, దురుశెట్టి పెద్ద సాయిలు కుటుంబాన్ని, గుండెపోటుతో మరణించిన చింతకుంటా గంగమణి కుమారుడు గంగయ్యను, గుండెపోటుతో మరణించిన దేవిప్రసాద్ కుటుంబ సభ్యులను, గుండెపోటుతో మృతిచెందిన ఎంగని రాజయ్య కుటుంబాన్ని, అలాగే వివిధ ప్రమాదాల్లో గాయపడ్డ దురుశెట్టి నాగమణి, కర్రె చింటూ, అలాగే కన్నపూర్, సురాయిపల్లి గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట ఏఎంసీ వైస్ చైర్మన్ సిద్దిరామ్‌రెడ్డి, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేష్, బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నేత నహీం, ఏఎంసీ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు పద్మనాగరాజు, గోవింద్ నాయక్, ఎంపీటీసీ వెంకటి, మాజీ ఎంపీపీ సాయిలు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నరహరి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాజయ్య, బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్, మాజీ వైస్ ఎంపీపీ సంగమేశ్వర్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో సాక్ష్యం చెప్పిన ఎంపీ అరవింద్


కోర్టులో సాక్ష్యం ఇవ్వడానికి వచ్చిన ఎంపీ అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ అదనపు జ్యూడిషియల్ ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్ కోర్టు (జూనియర్ సివిల్ జడ్జి)లో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ మంగళవారం ఒక క్రిమినల్ కేసులో సాక్షిగా హాజరయ్యారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసికూటర్ మహమ్మద్ రహీమోద్దీన్ నిజామాబాద్ ఒకటవ టౌన్ పోలీసుల తరపున ప్రాసిక్యూషన్ నిర్వహిస్తూ.. సాక్షిగా అరవింద్‌ను జడ్జి కుశనపల్లి సౌందర్య ముందు ప్రవేశపెట్టి ఆయన సాక్ష్యాన్ని నమోదు చేయించారు. 2019 జనరల్ పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా నిజామాబాద్ నగరంలోని హబీబ్‌నగర్‌లో ఎన్నికల పోలింగ్ కేంద్రంలో కొందరు టీఆర్ఎస్ కార్యకర్తలు రిగ్గింగ్‌కు పాల్పడుతూ వారికి అనుకూలంగా ఓట్లు వేయించుకుంటున్నారని ఆ విషయం తెలుసుకుని పార్టీ నాయకులు పల్లె గంగారెడ్డి, యెండల లక్ష్మి నారాయణ తదితరులతో కలిసి వెళ్లానని బీజేపీ కార్యకర్తలపై భౌతిక దాడికి పాల్పడి దౌర్జన్యం చేశారని తెలిపారు. 11 ఏప్రిల్ 2019న సదరు ఘటన జరిగిందని వివరించారు.

ప్రతి పేదవాడికి ఇల్లు కట్టుకోవడానికి

రూ.5లక్షల ఆర్థికసాయం

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్


జోడోయాత్రలో షబ్బీర్ అలీ, పలువురు నాయకులు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి పేదవాడికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని మాజీమంత్రి షబ్బీర్ అలీ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర విజయవంతం అయిన సందర్భంగా దానికి కొనసాగింపుగా 'హాత్ సే హాత్ జోడోయాత్ర'లో భాగంగా కామారెడ్డి పట్టణంలో హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భవానీరోడ్ కేకే హైచ్ స్కూల్ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు మాజీ మంత్రి, మాజీ మండలి ప్రతిపక్ష నేత మహమ్మద్ అలీ షబ్బీర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతా రావు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. భారతదేశ సంపద మొత్తం 10 లక్షల కోట్లు రాష్ట్ర బడ్జెట్‌తో పోలిస్తే నాలుగు సంవత్సరాల బడ్జెట్ సొమ్ము మోడీ ఆదానీ వల్ల ఆవిరైపోయిందన్నారు. మోడీ, అమిత్ షా ఇద్దరు గుజరాతీలు దేశ ప్రజల సొమ్మును దోచుకుంటూ ఇద్దరు గుజరాతీలైన అదానీ, అంబానీలకు అంటగడుతున్నారని తెలిపారు. భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలతో పేద ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నారని వివరించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం రాగానే రూ.500లకే వంట గ్యాస్ అందిస్తామని వివరించారు. ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు కట్టిస్తామని, స్థలం ఉండి ఇల్లు కట్టుకునే వారికి రూ.ఐదు లక్షలు అందిస్తామని వివరించారు. రూ.2లక్షల రైతు రుణాలను ఒకేసారి మాఫీ చేస్తామని, ఒకే ఇంట్లో అర్హులైన అందరికీ పెన్షన్లు అందిస్తామని చెప్పారు. బీడీ కార్మికులను రోడ్డుపై తీసుకువచ్చి ఉపాధి లేనివారిగా చేసే కుట్ర జరుగుతుందని, బీడీ కార్మిక రంగాన్ని, బీడీ వ్యవస్థనే రద్దు చేసే ఆలోచన జరుగుతుందని తెలిపారు. మహిళా అధ్యక్షురాలు సునీత రావు మాట్లాడుతూ.. అభయ హస్తం, స్త్రీనిధి, వడ్డీ లేని రుణాల విడుదల కోసం, పోరాటం చేస్తామన్నారు. గత నాలుగేండ్లుగా మహిళా సంఘాలకు రావలసిన వడ్డీ లేని రుణాల డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు కవితా పండ్ల రాజు, శివ కృష్ణమూర్తి, కారంగుల అశోక్‌రెడ్డి, గుడుగుల శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, ఐరేనీ సందీప్, రవి ప్రసాద్, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు..

పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు ఉంటాయని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కామారెడ్డి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు మహిళా అధ్యక్షురాల్లను ప్రకటించారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా జ్ఞానేశ్వరి, కామారెడ్డి టౌన్ అధ్యక్షురాలుగా సుమ, దోమకొండ మహిళా అధ్యక్షురాలుగా కవిత, భిక్కనూర్ మండలాధ్యక్షురాలిగా రేఖ, మాచారెడ్డి మండలాధ్యక్షులను ప్రకటించారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ.. కష్టపడే వారికి పదవులు ఇచ్చామని, పదవులు పొందిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పావలా వడ్డీ రుణాలు చెల్లిస్తామని, మహిళలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు.

అన్నాసాగర్ లో నివాసపు గుడిసె దగ్ధం

- తిమ్మాపూర్‌లో కల్లు గుడిసె దగ్ధం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


దగ్ధమైన నివాసపు గుడిసె

మండలంలోని అన్నసాగర్ గ్రామంలో సోమవారం రాత్రి బోరంచ రాజవ్వ అనే మహిళ నివాస గుడిసె ప్రమాద వశాత్తు దగ్ధమైంది. గుర్తు తెలియని దుండగులు రాజవ్వ నివసిస్తున్న రేకుల కొట్టానికి నిప్పంటించారని బాధితు రాలు వాపోయింది. మంటలు గమనించిన స్థానికులు అప్రమత్తమై వాటిని ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ పెరుగు నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందే విధంగా చర్యలు చేపడతానని హామీనిచ్చారు. అనంతరం ఈ విషయం ఎల్లారెడ్డి ఎమ్మార్వో సుధాకర్‌కు ఫోన్‌లో తెలియజేశారు. అలాగే మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఈశ్వర్ గౌడ్‌కు చెందిన కల్లు గుడిసె అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కల్లు గుడిసెలో ఉన్న పెట్టెలు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. అగ్ని ప్రమాదానికి కారకులు ఎవరో తెలియలేదని గ్రామస్తులు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎస్‌డబ్ల్యూ సీడీసీ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ జిల్లా నూతన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును సమీకృత కార్యాలయంలో టీఎస్ డబ్ల్యూ సీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత రాఘువేందర్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లత రాజు, మహిళలు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన జడ్పీ చైర్మన్

నూతన జడ్పీ కార్యాలయ నిధులకోసం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



నిజామాబాద్ జిల్లా జిల్లా పరిషత్ కార్యాలయం సుమారు 60 సంవత్సరాల చరిత్ర గలదని, ఆ భవనం పాతది అవుతున్నందున నూతన భవనం నిర్మించాలని జెడ్పీ చైర్మన్ దాదానగర్ విఠల్ రావు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావుని హైదరాబాదులో మంగళవారం మర్యాదపూర్వక కలిశారు. మొక్కను అందజేసి, ఈ విషయాన్ని గుర్తు చేస్తూ నిధులను మంజూరు చేయాలని జడ్పీ చైర్మన్ కోరారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు సానుకూలంగా స్పందించారని అన్నారు.

యథేచ్ఛగా స్కీముల దందా

- బంపర్ ప్రైజుల పేరిట మోసాలు
- కోట్ల రూపాయలు వసూలు చేసి పరార్

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాలో లక్కీ డ్రాల పేరిట నిర్వాహకులు కోట్ల రూపాయల వసూళ్లకు పాల్పడుతున్నారు. గతంలో నగరానికి పరిమితమైన ఈ స్కీం దందా ప్రస్తుతం జిల్లా అంతటా విస్తరించింది. ఒక్కో లక్కీ డ్రా గ్రూపులో రెండు నుండి మూడువేల వరకు సభ్యులను చేర్చుకుంటున్నారు బంపర్ ప్రైజెస్ వస్తాయంటూ అమాయకులను నమ్మించి ప్రతినెల వెయ్యి నుండి 1200 చొప్పున కట్టించుకుంటున్నారు. కొద్ది నెలలు గడిచిన తర్వాత నిర్వాహకులు ఉడాయించిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

2017 సంవత్సరంలో ప్రారంభం..

జగిత్యాలలో మొదలై కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఆర్మూర్ పట్టణ కేంద్రంలో కొన్నిచోట్ల ఎంటర్‌ప్రైజెస్‌ల పేరుతో దుకాణాలను ప్రారంభించారు. స్థానికంగా ఉన్న వ్యక్తులను ఏజెంట్లుగా నియమించుకున్నారు. ఒక వ్యక్తి రెండువేలు, మూడువేల మందిని సభ్యులుగా చేర్పిస్తూ లక్కీ డ్రాలను ప్రారంభించారు. ముందుగా లక్కీ డ్రాలలో కార్లు, విలువైన వస్తువులు ఇస్తూ నమ్మబలికారు. ఆ తర్వాత బోర్డులను తిప్పేస్తూ కంటికి కనిపించకుండా పోతున్నారు. స్థానికంగా ఉన్న కొందరు ఏజెంట్లు బాధిత వ్యక్తులకు సముదాయిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

జిల్లాలోని పలుచోట్ల...

జిల్లా కేంద్రంతో పాటు బోధన్, ఇందల్వాయి, డిచ్‌పల్లి, నవీపేట్, ఆర్మూర్, వర్ని ఇంకా అనేక మండలాల్లోనూ లక్కీ డ్రా స్కీములు నిర్వహిస్తున్నారు. సభ్యులు చెల్లించే డబ్బులకు నిర్వాహకులు ఇచ్చే వస్తువులు చాలా తక్కువ ధరకే లభిస్తుండడం గమనార్హం. ఇందులో చిరుద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, చిరు వ్యాపారులు గృహిణులను లక్కీ డ్రా లో సభ్యులుగా చేర్చుతున్నారు. సభ్యులుగా చేర్చిన వారికి నజరానాలు ఇస్తూ ఏజెంట్లను సైతం నియమించుకుంటున్నారు. వీరు ప్రజలకు మాయ మాటలు చెబుతూ మోసగిస్తున్నారు. గెలుపొందిన విజేతలకు బ్రాండ్ కంపెనీల టీవీలు, రిఫ్రిజిరేటర్లు ఇతరవస్తువులు చూపిస్తూ ఆకర్షిస్తున్నారు. స్కీం ముగిసే సమయంలో కొందరు చేతులు ఎత్తేస్తుండగా మరికొందరు అతి తక్కువ ధరకే లభించే నాణ్యత లేని వస్తువులు అంటగడుతున్నారు..

ఇలా రోజురోజుకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఈ మోసాలు పెరుగుతున్నాయి. ఇలాంటి విషయాల్లో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు చెబుతున్నారు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన బాధితులు

రూ. 5 కోట్లకు పైగా వసూలు..

పట్టణ కేంద్రంలో ఆలిస్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో నిర్వాహకులు గత కొన్ని సంవత్సరాల కింద ప్రారంభించి బోర్డు తిప్పేయడంతో సోమవారం లాటరీ బాధితులు, ఏజెంట్లు అధిక సంఖ్యలో కలెక్టరేట్‌కు తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఎంటర్‌ప్రైజస్ నిర్వాహకులపై స్థానిక పోలీస్ స్టేషన్లో 11 నెలల కింద బాధిత వ్యక్తులు ఫిర్యాదు చేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆందోళన వెలిబుచ్చారు. పట్టణంలోని మామిడిపల్లిలో ఒక కాలనీలో బాధిత వ్యక్తులు కొందరు ఏజెంటుతో వాగ్వివాదానికి దిగడం కొసమెరుపు.

మాది మధ్యతరగతి కుటుంబం...

రోజువారి కూలి పని చేసుకుని జీవిస్తున్నాం. మాది మధ్యతరగతి కుటుంబం .నెలకు వెయ్యి రూపాయలు చెల్లిస్తే ఏదో ఒక బహుమతి వస్తుందని నమ్మించారు. ఏడాది గడిచినా బహుమతి మాత్రం రాలేదు. ఏజెంట్ ం అడిగితే మీ పేరు వస్తుందిలే అంటూ దాటేస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో డబ్బులు ఎలా వసూలు చేసుకోవాలో తెలియడం లేదు. **- లక్ష్మి ఆర్మూర్**

కఠిన చర్యలు తీసుకుంటాం

ఎవరైనా లక్కీ డ్రాలా పేరిట వస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటాం.

- సురేష్ బాబు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆర్మూర్

కంటి వెలుగుకేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి



కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని కంటి వెలుగు కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వప్న మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియతో మాట్లాడుతూ... రోజుకు ఎంత మంది రోగులు కంటి వెలుగు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, కంటి వెలుగు కేంద్రంలో నెట్వర్క్ సరిగా పనిచేస్తుందా, కరెంట్ కోతలేమైనా ఉన్నాయా అని, కండ్ల పరీక్షలు నిర్వహించే ఎ.ఆర్ మిషన్ సరిగా పనిచేస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పండరి., సూపర్ వైజర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయికి ఎంపిక



సైన్స్ టాలెంట్‌టెస్ట్‌కు ఎంపకైన విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్ లో ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు మండల విద్యాధికారి ఆంధ్రయ్య తెలిపారు. ఆన్ లైన్‌లో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్ లో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన ఇద్దరు చొప్పున విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కమ్మర్‌పల్లి పాఠశాలకు చెందిన ఎస్. రిషిక మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, కోనా సముందర్ పాఠశాలకు చెందిన సాత్విక్, కమ్మర్ పల్లి పాఠశాలకు చెందిన లక్ష్మణ్ ద్వితీయ స్థానాన్ని పొందారు. ఈ ముగ్గురు విద్యార్థులు త్వరలో జిల్లా స్థాయిలో జరిగే సైన్స్ టాలెంట్ టెస్ట్ లో మండలం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని ప్రతి అంశాన్ని పాజిటివ్ గా తీసుకొని ముందడుగు వేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

టీయూలో క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్ -2023 రెండో రోజు క్రికెట్ మ్యాచ్ లు ప్రారంభమయ్యాయని తెలంగాణ యూనివర్సిటీ డైరెక్టర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డాక్టర్ సంపత్ మంగళవారం తెలిపారు. మొదటి మ్యాచ్ నిషిత డిగ్రీ కళాశాల నిజామాబాద్, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల కామారెడ్డి జట్లు ఆడారని,. అందులో కామారెడ్డి జట్టు గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుందన్నారు. రెండవ మ్యాచ్ మంజీరా డిగ్రీ కళాశాల కామారెడ్డి, గిరిరాజ్ డిగ్రీ కళాశాల నిజామా బాద్ పోటీ పడగా గిరిరాజ్ కళాశాల నిజామాబాద్ గెలుపొందిందని తెలిపారు. మూడో మ్యాచ్ యూనివర్సిటీ పీజీ కళాశాల, బోధన్ డిగ్రీ కళాశాలలు తలపడగా యూనివర్సిటీ పీజీ కళాశాల జట్టు గెలుపొంది సెమీ ఫైనల్ కు చేరుకుందని తెలిపారు. మిగతా సెమీఫైనల్ మ్యాచులు, ఫైనల్ మ్యాచ్ లు బుధవారం జరుగుతాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీఆర్ నేత తెలిపారు.

వరికి ఆశించిన కాండం తొలుచుపురుగు, ఆకుముడత

వ్యవసాయ అధికారుల సూచనల మేరకే మందులు వాడాలి



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

వరిలో కాండం తొలుచుపురుగు, ఆకుముడత ఆశించిందని మండల వ్యవసాయ అధికారి దేవిక అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి దేవిక మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన సమయంలో సరైన మందులు పిచికారి చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహా మేరకు మందులు కొనుగోలు చేసి పిచికారి చేయాలన్నారు. పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు వేయకూడదని తెలిపారు. అదేవిధంగా పీయం కిసాన్ పథకంలో ఈ కేవైసీ చేసుకోని వారు అప్డేట్ చేయించుకోవాలన్నారు. సంబంధిత బ్యాంకులో ఆధార్ సీడింగ్ కాని వాళ్ళు చేసుకోవాలని తెలిపారు. ఆమె వెంట పలు గ్రామాల రైతులు ఉన్నారు.

మహిళలకు చెస్ పోటీలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా యువజన, క్రీడల అధికారి ముత్తన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యువజన, క్రీడా కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 16న గురువారం జిల్లా స్థాయి చెస్ పోటీలు మహిళలకు డివైఎస్ఓ, స్విమ్మింగ్ పూల్, సుబాష్ నగర్, నిజామాబాద్ యందు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈపోటిలో మొదటి, రెండో బహుమతి పొందిన విజేతలకు యల్.బి. స్టేడియం, హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు పంపుతారని తెలిపారు. ఆసక్తిగల మహిళా చెస్ క్రీడాకారులు ఈనెల 16 జిల్లా యువజన, క్రీడా ప్రాధికార సంస్థ, స్విమ్మింగ్ పూల్, సుబాష్ నగర్‌లో ఆధార్‌తో హాజరుకావాలని సూచించారు.

ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



పన్నులు వసూలు చేస్తున్న జీపీ కార్యదర్శి

ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ కారోబర్ నరేందర్, సిబ్బందితో కలిసి ఇంటి పన్నులను వసూలు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రామం అభివృద్ధి చెందాలన్నా ఎలాంటి పనులు చేయాలన్నా ముందుగా డబ్బులు అత్యవసరమని, ప్రతి ఒక్కరూ విధిగా తాము గ్రామపంచాయతీకి చెల్లించ్సాన ఇంటి, ఇతర బిల్లులను సకాలంలో చెల్లించే విధంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఇంతకు ముందే ప్రతి ఇంటికి సంబంధించిన బకాయి డబ్బులు, పన్నులు చెల్లించడానికి నోటీసులు పంపిణీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీ ధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తపాల శాఖలో వడ్డీ రేట్లపై ప్రచారం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తపాల శాఖలో పెరిగిన వడ్డీ రేట్లపై ఇంటింటికీ తిరిగి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని పోస్ట్ మేన్ విజయ్ అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి తపాలాశాఖ సిబ్బంది అధ్వర్యంలో ఇంటింటికీ తిరగడంతోపాటు రైల్వేస్టేషన్, దుకాణాల్లో తిరుగుతూ తపాలా పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మేల్ ఓవర్సీస్ స్నేహిత్, గోవర్ధన్, రవి, సదానంద్, లతా, సింధుజ డిచ్ పల్లి తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వీర సైనికులకు ఘన నివాళ్లు



నివాళ్లు అర్పిస్తున్న ఉపాద్యాయులు, విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్ లో బుధవారం 2019లో పుల్వామాలో పాకిస్తాన్ ముష్కరుల దాడి ఘటనలో మరణించిన వీర సైనికులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ దేశానికి సైనికులు చేస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. కుటుంబాలను విడిచి, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సైనికులు దేశానికి సేవ చేయడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ప్రతి ఒక్కరు దేశాన్ని ప్రేమించాలని, దేశ సైనికులను గౌరవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిలుక గంగ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ కుందారం సచిన్, ఉపాధ్యాయులు కమల్, స్రవంతి, నాగశ్రీ, మనోజ్ఞ, స్వప్న, జ్యోతి, రూప శ్రీ, షాహిన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాలను సంరక్షించుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజలు, గర్భిణీలు, బాలింతలు అందరూ తమ ఆరోగ్యాలను సంరక్షించుకుంటూ యోగాను తప్పనిసరిగా చేసుకునే విధంగా చూడాలని ఎంపీటీసీ చింతల దాస్, ఏఎన్ఎం భానుప్రియ, అరుంధతి అన్నారు. మంగళవారం ఇన్నల్వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామపంచాయతీ, శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద హెల్త్ న్యూట్రిషన్ లో భాగంగా అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో న్యూట్రిషన్ లక్ష్యాలను వివరించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, అనునిత్యం యోగ సాధనతోపాటు వాకింగ్ చేయాలని, ఆహారపు అలవాట్లను వయసు రిత్యా మార్చుకో అనే విధంగా చూసుకోవాలని తెలిపారు. అనంతరం పలువురికి బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ అంగన్వాడి కార్యకర్తలు వనజ ఆసిఫా ఆశ కార్యకర్తలు బండ ప్రమీల పాశం జ్యోతి కారోబార్ నరేందర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాల్ బ్యాట్మెంటన్ తెలంగాణ జట్టుకు జిల్లా క్రీడాకారులు ఎంపిక









నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 10 నుండి 12 వరకు ఆర్మూర్ విజయ హైస్కూల్‌లో నిర్వహించిన 41వ తెలంగాణ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్టు బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ మంగళవారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు మొగులాజీ టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ ఉప్పల్‌వాయి, దీక్షిత్ తిమ్మాపూర్, హర్షిత మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ రెంజల్, సన్నిధి రెసిడెన్షియల్ స్కూల్ ధర్మారం (బి) క్రీడాకారులు తెలంగాణ జట్టుకు ఎంపిక అయ్యారని అన్నారు. వీరు ఈనెల 16 నుండి 20 వరకు తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో జరిగే 41వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాట్మెంటన్ క్రీడా పోటీలకు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలపారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపిక కావటం పట్ల బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారులు ఎన్వి హనుమంత్ రెడ్డి,జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, సంఘ సభ్యులు అభినందించారు.

ఉన్నత విద్యకు ఇంటర్ ఎంతో ఉపయోగకరం

ప్రిన్సిపాల్ రాజియొద్దీన్
జూనియర్ కళాశాలలో
ఫ్రెషర్స్ డే

నవతెలంగాణ-ధర్పల్లి



నిపుణులను సన్మానిస్తున్న విద్యార్థులు

ఉన్నత విద్యకు ఇంటర్ విద్య ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు కళాశాలకు కాలక్షేపంగా కాకుండా పట్టుదలతో చదివేందుకు వచ్చినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని కళాశాల ప్రిన్సిపాల్ రాజియొద్దీన్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు రెండవ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి అట పాటలతో ఉల్లాసంగా డీజే పాటలపై నృత్యాలు చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన ఆటలపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిధులుగా పాల్గొన్న ప్రేరణ నిపుణులకు విద్యార్థులు ఘనంగా సన్మానించారు, కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్ బాబు,తిరుపతి గౌడ్, హరిత, ప్రసన్న జ్యోతి, మురళి, విట్టల్, మహిపాల్, అశోక్, ఖయుం, సాయికృష్ణ, సయ్యద్ ఖమర్, ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం

మహిళల మధ్య చిచ్చు పెట్టొద్దు
బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కలిసి రండి
బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు పులి వసంత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అభయ హస్తమని, పావలా వడ్డీ రావడం లేదని ఇష్టానుసారంగా ప్రచారం చేసుకుంటున్నారని, డ్వాక్రా గ్రూపులకు పావలా వడ్డీ వస్తుందని, బ్యాంకులో శ్రీనిధి ఇంకా రాలేదని, ప్రస్తుతం ఆడిట్ కొనసాగడం వల్ల ఆలస్యం అవుతుందని, అవన్నీ త్వరలో వస్తాయని బీఆర్ఎస్ ఇందల్ వాయి మండల మహిళా అధ్యక్షురాలు పులి వసంత, కరుణ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొంత మంది రాజకీయ నాయకులు మహిళలను అడ్డు పెట్టుకొని రాజకీయ లబ్దికోసం చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. మత విష బీజం వేసి కులాలు, మతాల మధ్య ద్వేషం పెంచుతున్నారని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వానికి నిజంగా మహిళల పట్ల అభిమానం ఉంటే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వంతో పోరాటంలో మండల బీజేపీ నాయకులు కలిసి రావాలని, అంతే కానీ రాజకీయ అవసరాలకు మహిళల సంక్షేమ పథకాలకి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచా రం చేసే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని హెచ్చ రించారు. సమావేశంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు పి కరుణ, కె సుజాత, పి రాణి, తదితరులు పాల్గొన్నారు.

పసుపు వ్యాపారుల దోపిడీని అరికట్టాలి : ఏఐపీకేఎస్

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

పసుపు వ్యాపారుల దోపిడీని అరికట్టాలని, పసుపు మార్కెట్ యార్డుకి వచ్చి నెలరోజులుగా కావస్తున్నా నేటికి ఈ నామ్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకుండా వ్యాపారులు, మార్కెట్ అధికారులతో కుమ్మక్కై నేటికీ 65వేల క్వింటాళ్లకుపైగా పసుపు కొనుగోలు చేసి రైతులను నిలువు దోపిడీ చేశారని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ రైతు సంఘం (ఏఐపీకేఎస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. వ్యాపారుల లైసెన్సులను రద్దుచేసి వారిపై చర్యలు తీసుకోవాలని, వ్యాపారుల తో కుమ్మక్కైన అధికారులను సస్పెండ్ చేయాలని, ఈనామ్ మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలని అన్నారు.

అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ రైతు సంఘం జిల్లా కమిటీ, ఆర్మూర్ రైతు జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం పసుపు మార్కెట్ యార్డ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలకు పైగా పసుపు రైతులు పసుపు బోర్డు ఏర్పడితే కనీస గిట్టుబాటు ధర వస్తుందని ఎదురుచూస్తు న్నారన్నారు. ఒకరైతే నెల రోజుల్లో పసుపు బోర్డు ఏర్పాటుకు బాండ్లు రాసిచ్చి రైతులకు దగా చేశారని విమర్శించారు. పసుపును ఇతర దేశాల కార్పొరేట్ల నుండి దిగుమతి చేసుకునే కుట్రలో భాగంగా ఇక్కడ రైతాంగం పండించకుండా చేసేందుక ధర తగ్గించి పసుపు పంటనే లేకుండా చేయాలనే కుట్ర చేస్తున్నా రని ఆయన అన్నారు. పంటలకు చట్టబద్ధమైన ఎమ్మెస్పీ లేకపోవడం వల్ల రైతాంగం పూర్తిగా అప్పుల పాలై నిర్వీర్యం అయిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా ఐదు లక్షల మంది వ్యవసాయం నుంచి తప్పుకుంటున్నారని అన్నారు. దీనివల్ల ఆహార ఉత్పత్తుల కోసం బడా కార్పొరేట్ సంస్థలపై ఆధారపడే ప్రమాదకరమైన రోజులు రానున్నాయని తెలిపారు.

ఈ నామ్ మార్కెట్ ను వెంటనే ప్రారంభించాలని పసుపును క్వింటాలుకు 15 వేల రూపాయలకు కొనుగోలు చేయాలని, ఇప్పటివరకు కొనుగోలు చేసిన వారికి నష్టపరిహారం చెల్లించాలని మార్కెట్ కమిటీని డిమాండ్ చేశారు. లేదంటే ఉఉఉద్యమాన్ని చేపడతామని ఆయన అన్నారు. ఈబృందంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకృష్ణ, ఏఐపికెఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.దేవరం, జిల్లా అధ్యక్షులు గుమ్మల గంగాధర్, ఆర్మూర్ రైతు జేఏసీ నాయకులు పిట్ట.గంగారం, జే.లింగారెడ్డి, ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.బాబన్న, యు.రాజన్న, ఏపీగంగారాం, అనిల్, రైతులు పాల్గొన్నారు.

తాత్కాలిక షెడ్డు కోసం స్థలం పరిశీలన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలో మూడు కోట్లతో నూతన బస్టాండ్ నిర్మిస్తున్న దృష్ట్యా పాత బస్టాండ్‌ను కూల్చడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా పాత బస్టాండ్ ప్రాంతం దగ్గర ప్రయాణికుల కోసం తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేయనున్నట్టు ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మంగళవారం తెలిపారు. స్థలం పరిశీలించిన అనంతరం స్థానిక బాన్సువాడ డీఎంతో మాట్లాడే రెండు రోజుల్లో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ నర్సింలు, కౌన్సిలర్ రాము, బీఆర్ఎస్ నాయకులు శ్రవణ్ కుమార్ రాజు, అరవింద్‌గౌడ్, సాయి, రాములు, ఇమ్రాన్, రాజిరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-పిట్లం

బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలను 15వ తేదీన బంజారాలు ఘనంగా నిర్వహించాలని మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా బంజారా అధ్యక్షుడు కాత్రోత్ రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను గ్రామీణ తాండ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రతి తాండాలలోని జగదాంబ మాత, రామారావు మహారాజ్ ఆలయాల వద్ద కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బండాపల్లి మాజీ సొసైటీ చైర్మన్ సర్ చందు, నియోజకవర్గ నాయకులు సవైసింగ్, మండల కోఆర్డినేటర్ సక్రు, గుడి పూజారి సంగ్య తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందజేయాలి

- సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందజేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మధ్యాహ్నం భోజనం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో భోజనాన్ని చేత పట్టుకొని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్న మంచి ఆరోగ్యాన్ని విద్యార్థులకు అందించాలంటే సివిల్ సప్లై అధికారులు సన్న బియ్యం అందించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని సన్నబియ్యంను మధ్యాహ్న భోజన కార్మికులకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులచే నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. వెంటనే సివిల్ సప్లై అధికారులు మధ్యాహ్న భోజన సెంటర్లలో సన్న బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

నవతెలంగాణ-మద్నూర్

సహకార కేంద్ర బ్యాంకుల్లో రుణాలు పొందిన వారందరూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి హౌస్ అటాచ్‌మెంట్ నోటీసులు జారీ కాకుండా చూసుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ జీఎం, డీజీఎం, ఎంజీఎం, అధికారులు రుణాలు పొందిన వారందరికీ విజ్ఞప్తి చేశారు. రుణాలు పొంది సకాలంలో చెల్లించకుండా బకాయిపడ్డ రుణాల కోసం అధికారులు ప్రత్యేకంగా చర్యల్లో భాగంగా మొండి బకాయిదారులకు హౌస్ అటాచ్‌మెంట్ నోటీసులను మంగళవారం జారీ చేశారు. మండల కేంద్రంలో గల జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలోని రుణ బకాయిలపై ఉన్నతాధికారులు పరిశీలించారు. బకాయిల వసూళ్ల కోసం చర్యలు చేపట్టారు. రుణాలు పొందిన వారు వెంటనే బకాయిలు చెల్లించుకుని హౌస్ అటాచ్‌మెంట్ నోటీసులు జారీ కాకుండా చూసుకోవాలని కోరారు. రుణాలు కట్టకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రుణాలు పొందిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంక్ అధికారులు, మద్నూర్ బ్యాంక్ అధికారి రమేష్, మద్నూర్ సొసైటీ కార్యదర్శి బాబురావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చలో ఇందిరా పార్కుకు తరలిన అంగన్‌వాడీలు

నవతెలంగాణ-పిట్లం

అంగన్వాడీల డిమాండ్‌ల సాధనకై సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజధాని హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో నిర్వహించ తలపెట్టిన చలో ధర్నాకు మండలం నుంచి అంగన్వాడీ టీచర్లు మంగళవారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు కుమ్మరి రాధా మాట్లాడుతూ.. తమ సమస్యల హామీ పరిష్కారంలో ఏండ్ల నుంచి గత ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి కనువిప్పై తమ డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, కనీస వేతనాలు అమలు చేసి పర్మినెంట్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్ బెడ్‌రూమ్‌లను అర్హులందరికీ వర్తింపచేయాలని ధర్నాలో డిమాండ్ చేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పి.గంగామణి, అనురాధ, ప్రవీణ, జయంతి, శోభ, విజయలక్ష్మి, జంగం సుమలత, పుష్ప, రాధిక, మంజుల ఆయా గ్రామాల టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రింటర్ వితరణ

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బిచ్కుంద లయన్స్ క్లబ్ డైమాండ్ విభాగం తరపు నుంచి ప్రింటర్‌ను మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.అరవింద్‌కు అందజేశారు. అదేవిధంగా జుక్కల్ విండో సీఈవో బాబురావ్, బిచ్కుంద లయన్స్ క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ జావీద్ సిద్ధికి రేపటి నుంచి నిర్వహించే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు అవసరమయ్యే స్టేషనరీ ఖర్చులకు తల రూ.వేయి నగదును అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు వితరణ చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ గోపాల్, జోనల్ చైర్‌పర్సన్ డా.ఓంప్రకాష్, శాంతాపూర్ మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

నవతెలంగాణ-బోధన్

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మాజీ మంత్రి, టీపీసీసీ కోశాధికారి పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి బోధన్ పట్టణంలోని 5వ వార్డ్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యాకర్త నాగేశ్వర్ రావు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో బాధిత కుటుంబానికి పార్టీ ఆధ్వర్యంలో 2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాశంకర్, పాషా మోహినోద్దీన్, గంగాధర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నీరడి సాయన్న మాతృమూర్తి నీరెడి లక్ష్మి వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారాన్ని పార్టీ శ్రేణులతో తెలుసుకున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కోశాధికారి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి మంగళవారం పోచారం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. నీరడి లక్ష్మి మృతికి గల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎడపల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షులు పులి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రాధా కిషన్‌గౌడ్, నీరడి రవికుమార్, తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు గంగాధర్, నాయకులు రాధా కిషన్‌గౌడ్ లింగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట (జేసీ)లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయిలో సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ టాలెంట్‌టెస్ట్‌కు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో చేతన్ (జడ్పీహైస్కూల్ ఎరాజ్‌పల్లి), సింధూజ (జడ్పీహైస్కూల్ అమ్దాపూర్) విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌ఎం రాజేశ్వరశర్మ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బస్వరాజ్, సునీత్ కుమార్, గోపి, రత్నాకర్ పాల్గొన్నారు.

స్ట్రీట్ కార్నర్ సమావేశం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బీజేపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో భాగంగా ఎల్లారెడ్డి మండలంలో మూడవ సమావేశాన్ని మండలంలోని వెళ్ళుట్లపేట సర్పంచ్ గోశికె చిరంజీవులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు మహారాజుల మురళి, ఎల్లారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, రాష్ట్ర నాయకులు బత్తిని దేవేందర్, ఓబీసీ కార్యవర్గ సభ్యులు పోచన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయిన

ఎమ్మెల్యే సురేందర్‌కు బుద్ధి చెపుతాం

- కాంగ్రెస్ నియోజవకర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-గాంధారి

బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయిన ఎమ్మెల్యే సురేందర్‌కు బుద్ధి చెపుతామని కాంగ్రెస్ నియోజవకర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హత్ సే హత్ జోడో పాదయాత్రకు అపూర్వ స్పందన లభిస్తోంది. మండలంలోని నర్సాపూర్, ముదేల్లి, హెమ్లనాయక్ తండా, వెంకటాపూర్, గౌరారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ హత్ సే హత్ జోడో పాదయాత్రను ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడపగడపకూ తిరుగుతూ టీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇస్తూ పాదయాత్ర నిర్వహించారు.



మాట్లాడుతున్న వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి

ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని, అదేవిధంగా నిత్యావసర వస్తువుల ధరలు గానీ, గ్యాస్, డీజిల్, పెట్రోల్ అన్నీ కూడా సామాన్య మానవునికి అందుబాటులో ఉంటాయని, అంతేకాకుండా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రజలు నల్లమడుగు సురేందర్‌ను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ నియోజకవర్గ ప్రజల గుండెల మీద తన్ని కోట్ల రూపాయల టీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయాడని, సురేందర్‌కు రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా బుద్ధి చెప్తామని అన్నారు. కావున కార్యకర్తలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కామెల్లి బాలరాజు, మోహన్‌నాయక్, మదర్, లైన్ రమేష్, సంగెం రాజు, రాజు నాయక్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- యువతీయువకులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి
- వైయస్ఆర్‌సీపీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి జమున రాథోడ్

నవతెలంగాణ-లింగంపేట్

క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని.. ఓడిపోయిన వారు గెలుపు కోసం ప్రయత్నం చేయాలని వైఎస్ఆర్‌సీపీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి జమున రాథోడ్ అన్నారు. మంగళవారం మండలంలోని పర్మల్ల మాలవత్ తండాలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో యువతీ యువకులు సెల్‌ఫోన్, టీవీలకు పరిమితమైపోతున్నా. క్రీడల పట్ల ఆసక్తి చూపడం లేదన్నారు. సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజన తండాలో క్రీడలు నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో క్రీడలకు పెద్దపీట వేసి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడలకు ఆనాటి వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రోత్సహించారన్నారు. అదేవిధంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బద్యానాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్, మాలవతాండ సర్పంచ్ సునీత ప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నరహరి, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, సర్పంచులు పోచయ్య ఎంపీటీసీ విట్టల్, ఆయాగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జమున రాథోడ్

సైక్లింగ్‌తోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఉప వైద్యాధికారి డాక్టర్ విద్య

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : సైకిల్ నడపడంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని, కావున ప్రతి ఒక్కరూ ప్రతిరోజు 15 నిమిషాల పాటు సైకిల్ నడపడం అలవాటు చేసుకోవాలని బోధన్ డివిజన్ ఉప వైద్యాధికారి డాక్టర్ విద్య అన్నారు. ఆయూష్మాన్ భారత్‌లో భాగంగా ఆమె బోధన్ పట్టణంలోని పాన్‌గల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సైక్లింగ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న హెల్త్ అండ్ వెల్‌నెస్ కార్యక్రమంలో వివిధ రుగ్మతలతో బాధప డుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. అలాగే సైకిల్ నడపడం వలన బీపీ, షుగర్ వ్యాధులు తగ్గడంతో పాటు రక్తప్రసరణ సక్రమంగా జరిగి గుండె సంబంధ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, ఆర్డీఓ రాజేశ్వర్ ఉత్సాహంగా సైకిల్ నడిపారు. ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎడపల్లిలో ర్యాలీ

రెంజల్ : వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు సైకిల్ ర్యాలీ నిర్వహించినట్టు వైస్ ఎంపీపీ యోగేష్ అన్నారు. మంగళవారం మండలంలోని నీల గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యం కోసం సైకిల్‌పై వెళ్లడం ఎంతో ఉత్తమమని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజు బైకులకు బదు లుగా సైకిల్ నడిపితే ఆరోగ్యం అదుపులో ఉంటుందన్నారు. కార్యక్ర మంలో స్థానిక నాయకులు రాఘవేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవనశైలి వ్యాధులపై అవగాహన..

రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్‌కుమార్ ఆదేశాల మేరకు జీవన శైలి వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. హెల్త్ వెల్‌నెస్‌లో భాగంగా యోగ, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు మధుమేహం, రక్తపోటు, వ్యాధులు కలవారు వీటిని తప్పకుండా పాటించాలని సూచించారు. గర్భిణులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓలు శ్రావణ్ కుమార్, కరిప రవీందర్, పీహెచ్ రాణి, సూపర్‌వైజర్ మాలంబి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సైకిల్ ర్యాలీ

వర్ని(మోస్రా) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆజాదికా అమృత్ 75వ మహోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని పలు వీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. హెల్త్ బులిటెన్‌లో స్వచ్ఛమాన్, స్వచ్ఛనగర్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీ నిర్వహించినట్టు మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమా, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షులు పిట్ల శ్రీరాములు, మండలాధ్యక్షులు సర్పంచ్ సుమలత రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంగళవారం జాతీయ అమృత్ మహోత్సవ కార్యక్రమాన్ని ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచన మేరకు ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ అమృత్ మహోత్సవ ర్యాలీ సైకిల్ యాత్రను వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పుర వీధుల్లో, ప్రధాన రహదారుల గుండా వైద్య సిబ్బందితోపాటు ఉన్నత పాఠశాల బాలురు సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడారు. సైకిల్ తొక్కడం వలన దాంతో దూర ప్రయాణం చేయడం వలన వ్యక్తులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తూ రక్తప్రసరణ సక్రమంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినీత్‌రెడ్డి, ఆసుపత్రి పాలనాధికారి రాములు, పర్యవేక్షకులు రాజేశ్వర్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, పాఠశాల బాలురు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పంతుళ్లను నియమించి

విద్యార్థుల భవిష్యత్తును కాపాడండి

నవతెలంగాణ-మద్నూర్

కామారెడ్డి జిల్లా కేంద్రానికి పూర్తిగా రాష్ట్ర సరిహద్దులో గల మహారాష్ట్ర బార్డర్‌లో ఉన్న మద్నూర్ మండలం హండేకేలూర్ గ్రామంలో గల యూపీఎస్ పాఠశాలలో గతంలో మరాఠీ మీడియం చదువు కొనసాగేది. గత రెండు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం తెలుగు మీడియం బోధన కోసం ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రస్తుతం ఈ పాఠశాలలో తెలుగు మీడియం బోధన కొనసాగుతున్నప్పటికీ బోధించే టీచర్లు మాత్రం మరాఠీ మీడియం ఉపాధ్యాయులే కొనసాగడంతో తెలుగు మీడియం చదువు అందక భవిష్యత్తు నాశనం అవుతుందని సర్పంచ్ నీలావతి మండల విద్యాశాఖ అధికారికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం పాఠశాలలో 156 మంది పిల్లలు ఉన్నట్టు పేర్కొన్నారు. తెలుగు మీడియం కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసినా మరాఠీ మీడియం టీచర్లతో బోధించడం తెలుగు మీడియం చదువులు అందక విద్యార్థిని విద్యార్థులు తమ భవిష్యత్తును కోల్పోవలసి వస్తుందని తెలుగు మీడియం బోధన టీచర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త హనుమాన్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆయుష్మాన్ భారత్ యోజన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

ఆయుష్మాన్ భారత్ యువజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పండరి అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మానగర్ పంచాయతీ కార్యాలయంలో నవీన్ సీఎస్సీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారందరూ ఆయుష్మాన్ భారత్ యోజన పథకానికి అర్హులన్నారు. ప్రతి ఒక్కరూ రేషన్‌కార్డు, ఆధార్ ధ్రువపత్రాలతో సెంటర్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జి సెక్రెటరీ జాకిర్ హుస్సేన్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్ట్రీట్ కార్నర్ మీటింగ్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గౌరారం గ్రామంలో బీజేపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్‌లో భాగంగా మండలంలోని గౌరారం గ్రామంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, గాంధారి మండలాధ్యక్షులు సాయిబాబా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బీజేవైఎం మండలాధ్యక్షులు ఈకే ప్రభాకర్, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎంఐ, చిట్టీ డబ్బులు కట్టలేక యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈఎంఐ, చిట్టీ డబ్బులు కట్టలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండో పోలీస్ స్టేషన్ ఎస్ఐ పూర్ణేశ్వర్ వివరాల ప్రకారం.. నగరంలోని ఐటీఐ శివాజీ నగర్‌కు చెందిన దమ్ముల గణేష్ (24) మున్సిపల్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ ఓ ప్రయివేటు ఆస్పత్రిలో వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. గణేష్ కొద్ది రోజుల క్రితం ఓ కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్‌ను ఈఎంఐలో కొనుక్కున్నాడు. చిట్టీలేపి డబ్బులను కూడా తీసుకున్నాడు. ఈఎంఐ, చిట్టీల డబ్బులు కట్టలేక తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాదయాత్రను జయప్రదం చేద్దాం

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని పంచాయతీ వర్కర్, ఎంప్లాయిస్ (సీఐటీయూ) మండల కోకన్వీనర్ సతీష్ పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో పాదయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు పర్మినెంట్, స్పెషల్ స్టేటస్, వేతనాల పెంపుదల, మల్టీపర్పస్ రద్దు కోసం ఈనెల 12న జనగామ జిల్లా పాలకుర్తి మండలం నుంచి పాదయాత్ర మొదలైందని తెలిపారు. 17రోజులపాటు ఈ పాదయాత్ర కొనసాగుతుందని, 28వ తేదీన హైదరాబాద్‌లో భారీ మహాసభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సభకు రాష్ట్ర జాతీయ సీఐటీయూ నాయకులు పాల్గొంటారని, ఈ పాదయాత్ర సభను పంచాయతీ కార్మికులందరూ జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, సాయమ్మ, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సాలూర మండలంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

నూతనంగా ఏర్పడిన సాలూర మండలంలో తొలి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఖాజాపూర్ గ్రామానికి చెందిన మహిళ రైతు పద్మ సుధాకర్ దంపతులు వారి భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో తహసీల్దార్ మమత భూమి రిజిస్ట్రేషన్ పూర్తిచేసి రైతు దంపతులకు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా రైతు దంపతులు మాట్లాడుతూ.. సాలూర మండలంలో మొదటి రిజిస్ట్రేషన్ చేసుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తహసీల్దార్ మమత మాట్లాడుతూ.. నేటి నుంచి రెవెన్యూకు సంబంధించిన, భూములకు సంబంధించిన పూర్తి కార్యకలాపాలు కొనసాగుతాయని కావున రైతులు, మండల ప్రజలు అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు మాజీ మండలాధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, సర్పంచులు చింతం నాగయ్య, ఆర్.గంగాధర్, రైతు ఇల్తెపు గంగారం తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఎడపల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యం మేరకు కంటి వెలుగు పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో కంటి చూపుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు కంటి వెలుగు కేంద్రాలకు సకాలంలో చేరుకొని కంటి పరీక్షలను నిర్వహించుకోవాలని ఎడపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మంగళ్‌పాడ్ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి కంటి దగ్గర, దూరం చూపుతో ఇబ్బందులు పడుతున్న వారికి కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరం ఉన్నవారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. స్థానిక ఎంపీటీసీ వనజ నాగరాజు, జీపీ బిల్ కలెక్టర్ పద్మావతి, కంటి వెలుగు డీఇఓ ప్రశాంత్, కంటి వైద్య నిపుణులు శ్రీకాంత్, ఏఎన్ఎంలు శాంత, శైలజ, అంగన్వాడీ ఉపాధ్యాయులు అనురాధ, ఆశావర్కర్లు విజయ, కుంట అనిత, లత, సరిత, కవిత, సవిత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను అడ్డుకోవడం సరికాదు

నవతెలంగాణ-మద్నూర్

సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం సరైనది కాదని, సర్కారు చర్యలు సిగ్గుచేటని ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్వాడీ (సీఐటీయూ) కార్మిక సంఘం అధ్యక్షురాలు చెంపబాయి అన్నారు. మద్నూర్ మండలం నుంచి అంగన్వాడీ టీచర్లు మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలుతుండగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు సిగ్గుచేటని, సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి అనుమతులు ఉన్నప్పటికీ పోలీసులతో సర్కార్ అడ్డు తగలడం ఏమిటని ప్రశ్నించారు. అరెస్ట్ అయిన వారిలో అంగన్వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తెలంగాణ మోడల్ స్కూల్ అసోసియేషన్ డైరీని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ చేతుల ఆవిష్కరించరు. కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి కే నాగరాజు, సంఘం సభ్యులు శశిశంకర్, అంజిలప్ప, స్రవంతి, లక్ష్మీనరసయ్య, జనార్ధన్, గంగాప్రసాద్, శక్తిరాజ్, భాగ్యలక్ష్మి అజయ్, శివాజీ, ప్రిన్సిపాల్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

నవతెలంగాణ-రెంజల్

మండల పరిధిలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని కే హర్షిత జాతీయస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ హర్షయనాజం పేర్కొన్నారు. ఇటీవల ఆర్మూర్ మండలంలోని విజయ పబ్లిక్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. మైనారిటీ రెసిడెన్షియల్ స్కూలు నుంచి కె.హర్షిత ఎంపికయ్యారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు భాగ్యశ్రీ, పాఠశాల ప్రిన్సిపాల్ హర్షియా నాజం విద్యార్థినిని అభినందించారు.

ఎర్రజొన్న సిండికేట్ మాఫియా

నవతెలంగాణ-ఆర్మూర్

ఎర్రజొన్న వ్యాపారుల సిండికేట్ ముఠా మరోసారి రైతులను మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని, ఒకేసారి 4000 నుండి 3200కు తెచ్చిన ఎర్రజొన్నల ధరే నిదర్శనమని పట్టణ కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారిలో 3500 ధర నడుస్తుందని, వారం రోజుల క్రితం కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న ఎర్రజొన్నలు 4000 కు అమ్ముడుపోయాయని, రెండు రోజుల క్రితం వరకు 3800 అమ్ముడుపోయాయని పేర్కొన్నారు. ఆలూరు గ్రామంలో టెండర్‌కు వెళ్లి 3230 రూపాయలు ధర చెప్పిన సిండికేట్ మాఫియాకు రైతులు ఒప్పుకోలేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం, కలెక్టర్, వ్యవసాయ అధికారులు స్పందించాలని కోరారు. మంచి ధర ఉందనుకున్న రైతుల సంతోషంపై నీళ్లు చల్లుతున్న ఎర్రజొన్న మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కతర్ సేవా సమితి ఆధ్వర్యంలో బాధితులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఏర్గట్ల

దోంచంద గ్రామానికి చెందిన పుట్టి గంగాధర్, సుద్దాల గంగారాం అనారోగ్యంతో అచేతనంగా లెవలేని స్థితిలో ఉండడంతో కతర్ సేవా సమితి సభ్యులు కారం మారుతి, ఆడెపు శ్రీధర్, మహేష్, బొల్లుమల్ల నవీన్, బోడ పెద్ద భాజన్న, మేడే ఎల్లన్న కలిపి వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం చేశారు. బాధితులకు చెరో 10 వేల చొప్పున అందజేశారు.



24న ఎడపల్లి నుంచి నిజామాబాద్ వరకు పాదయాత్ర

- రాష్ట్రవ్యాప్త యాత్రకు సంఘీభావంగా..
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ పాదయాత్రకు సంఘీభావంగా ఈనెల 24న ఎడపల్లి నుండి నిజామాబాద్ వరకు జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ పిలుపునిచ్చారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులకు మున్సిపల్ కార్మికులవలే జి ఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని . పాలకుర్తి నుండి హైదరాబాద్ వరకు పంచాయతీ కార్మికుల పాదయాత్ర సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ నాయకత్వంలో ప్రారంభమైందన్నారు. దీనికి సంఘీభావంగా ఈనెల 24న నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం నుండి నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర ఉంటుందని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులు కారోబార్లు బిల్ కలెక్టర్లు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో అన్ని రకాల ఉద్యోగులకు, ఇతర కార్మికులకు వేతనాలు పెంచారని తెలిపారు. పంచాయతీ కార్మికులకు మాత్రమే పీఆర్సీ ప్రకారం వేతనాలు పెంచలేదని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబానికి 5 లక్షల ఇన్సూరెన్స్ అందించాలని. జీఓ నెంబర్ 51 సవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దుచేసి కేటగిరీల వారిగానే పనులు చేయించాలని, జీఓ 60 ప్రకారం పారిశుద్య కార్మికులకు 15,600 వేతనం చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం పాదయాత్ర ముగింపు రోజు ఇందిరాపార్క్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆమె అన్నారు. అయినా ప్రభుత్వం దిగిరాకపోతే కార్మికులు మరో పోరాటానికి సిద్ధమవుతారని తెలిపారు, కార్యక్రమంలోయూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, పసియోద్దీన్, పోశెట్టి, శంకర్, సాయిలు, అర్బాస్, సాయమ్మ, పద్మ, గంగమ్మ, చిన్న సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్

20 వరకు మార్కెట్ యార్డుకు సెలవు

- పచ్చి పసుపు తేవొద్దు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మార్కెట్ యార్డులో పచ్చి పసుపు అమ్మకం పూర్తిగా నిషేధించామని వ్యవసాయ మార్కెట్ కమిటి సెలక్షన్ సెక్రటరీ వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పచ్చి పసుపు మార్కెట్ యార్డుకు తెచ్చి అమ్మకం కోసం వేచిఉండే కంటే ఇంటి వద్దనే బాగా ఎండబెట్టి తీసుకురావాలని కోరారు. గత మాసంలో కార్యాలయ సిబ్బంది ప్రతి గ్రామ గ్రామన తిరిగి మైకు ద్వారా ప్రచారం చేశారని, అదే ప్రాతిపదికన ఖరీదుదారులకు పచ్చి పసుపు కొనుగోలు చేయరాదని సూచనలు జారీ చేశామని తెలిపారు. అధిక మొత్తములో పచ్చి పసుపు మార్కెట్ యార్డుకు తీసుకరావడంతో మార్కెట్ యార్డులో కొనుగోళ్ళ నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈనెల 13,14 న వచ్చిన పసుపు సుమారు 25వేల బస్తాలు వచ్చిందని, ఈసరుకు 15, 16, 17 న అమ్మబడునని వివరించారు. రైతు సోదరులందరు ఈనెల 15 నుండి యార్డుకు తీసుకురాకూడదని తెలిపారు. 18న శివరాత్రి, 19న ఆదివారం, 20 సోమవారం అమావాస్య కారణంగా యార్డునకు సెలవులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 21 న మార్కెట్ యార్డులో అమ్మకాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



ఏర్గట్ల : తుపాకుల శ్రీనివాస్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న మంత్రి వేముల

నవతెలంగాణ-ఏర్గట్ల/కమ్మర్‌పల్లి

మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్ నాన్న, బీఆర్ఎస్ నాయకులు లక్కం నర్సయ్య తల్లి చనిపోవడంతో వారి కుటుంబాలను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయనవెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, పీఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు నేరెళ్ళ లింగారెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, గన్నారపు రాజేశ్వర్, పోలింగ్, తదితరులున్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని పలు కుటుంబాలను రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. మండల కేంద్రంలో పార్శిపు జైపాల్ రెడ్డి తల్లి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కోనాసముందర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కుమారుడు రత్నాకర్ ఇటీవల చెందాడు. వారి కుటుంబాల సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఇదే గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మనోజ్ తల్లి ఇటీవల మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులను కూడా మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి బాధిత కుటుంబాలకు మనోధైర్యాన్ని కల్పిస్తూ నేనున్నానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రేగుంట దేవేందర్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు

పీఎంటీఏ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ (పిఎంటీఏ) డైరీని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి లోకం రఘురాజ్ డిఐఈఓ కార్యాలయంలో అవిష్కరిచారని పిఎంటీఏ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ పెందోటి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించాలని, రాబోయే పరీక్షలకు సిద్ధం చేయాలని, పరీక్షల భయాన్ని తొలగించాలని తెలిపారు. అదేవిధంగా ప్రిన్సిపల్ పెరోజ్ హైదర్ పీఎంటీఏ క్యాలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వర రావు , కార్యదర్శి శంకర్, జిల్లా సంఘ బాద్యులు కులకర్ణి రాఘవేందర్, శ్రీనివాస్, రఘు, సాయి కృష్ణ, సత్యం పాల్గొన్నారు.

కలెక్టర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జన్మదినం సందర్భంగా మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎంప్లాయిస్ జేఏసీ పక్షాన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేయించారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ కిషన్, జిల్లా కార్యదర్శి అమృత్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కండి

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధ్వర్యంలో జిల్లాలోని ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్నెస్ సెంటర్లలో ఆరోగ్య మేళా నిర్వహించారు. ప్రతి నెల 14న నిర్వహించే ఆరోగ్య మేళాలో భాగంగా ఈ నెలలో ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కండి అనే నినాదంతో మంగళవారం దుబ్బా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం సుదర్శనం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం మాట్లాడుతూ.. టెలీకన్సల్టేషన్, జీవనశైలి వ్యాధులను పరీక్ష చేయడం, క్షయ వ్యాధి మందుల పంపిణీ, పాలియేటివ్ కేర్ సేవలు జిల్లా వ్యాప్తంగా ఉన్న 141 హెల్త్ వెల్నెస్ సెంటర్‌లతోపాటు 40 పీహెచ్సీ, యూపీఎచ్సీలలో నిర్వహిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య అలవాట్లను పాటిస్తూ పోషకాహారం, స్వచ్ఛమైన తాగునీరు తీసుకుని స్వచ్ఛతను పాటించినట్లయితే ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని అన్నారు. షుగర్ తో పాటు క్షయ మొదలగు వ్యాధులను నివారిస్తూ రక్తహీనత పోషకాలోపాల వ్యాధుల్ని అరికట్టినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో దుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ శ్రీలత గిర్రాజ్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సునీత మేడం మరియు జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు , హెచ్ ఈ ఓ గోవర్ధన్, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాఠశాల విద్యార్థులు గిర్రాజ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్గత క్రీడా పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక విజయ్ హైస్కూల్లో 2022-23వ సంవత్సరానికిగాను 25వ అంతర్గత క్రీడల ముగింపు కార్యక్రమం మంగళవారం ముగిసినట్టు విజయ్ హై స్కూల్ కార్యదర్శి అమృతలత తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.నరేష్, గౌరవ అతిథిగా సబ్ ఇన్‌స్పెక్టర్ లింబాద్రి, పూర్వ విద్యార్థిని అయిన ప్రభుత్వ ఉపాధ్యాయిని సత్యకుమారి విచ్చేశారు. అనంతరం ముఖ్య అతిథి నరేష్ మార్చ్ ఫాస్ట్ విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువుతో పాటు ఆటలు అవసరమని గుర్తించి ప్రాముఖ్యతనిస్తున్న పాఠశాల యాజమాన్యం వారిని అభినందించారు. ఎదిగే వయసు పిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరించి చెప్పాలని అన్నారు. ఉపాధ్యాయులు పిల్లలతో చనువుగా ఉంటే వారి మంచిచెడ్డలు చెప్పుకుంటారని, ఈ మధ్య సెల్‌ఫోన్ ద్వారా దుండగులు డబ్బులు అపహరిస్తున్నారని, ఆగంతకులు వివరాలడిగితే అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. గౌరవ అతిథి లింబాద్రి మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లో ఆటలు కాకుండా మైదానాల్లో ఆడితే దేహదారుఢ్యం, మానసిక ప్రశాంతత, గెలుపోటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడుతుందని అన్నారు. విశిష్ట అతిథి సత్య కుమారి మాట్లాడుతూ సరైన ప్రణాళికతో చదివితే సునాయాసంగా పరీక్షలు రాయవచ్చని తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పెద్దలను గౌరవించాలని రెండో తరగతి చదివే రోజుల్లో అమృతా మేడం చెప్పారని ఇప్పటికీ ఎక్కడ పెద్దలు కనబడినా వినయంగా, ఆప్యాయంగా పలకరిస్తానని, ఈ మంచి అలవాట్లు ఈ పాఠశాల ద్వారానే నేర్చుకున్నారని ఆమె అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ సంవత్సరానికి ఛాంపియన్ షిప్ అందుకున్న పుష్పక్ టీం సారథులు క్రీడా పతాకాన్ని పాఠశాల యాజమాన్యం వారికి అందజేశారు. కార్యక్రమంలో విజయ్ హై స్కూల్ కరస్పాండెంట్ వి. ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపాల్ విజేత. వ్యాయామ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ నరేష్

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ పాలన

- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి సహకారంతో గ్రామాలకు ప్రత్యేక నిధులు మంజూరు
- ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి



ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-ధర్పల్లి

బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని, గతంలో ఏప్రభుత్వాలు ప్రభుత్వాలు చెయ్యని అభివృద్ధి కేసీఆర్ ద్వారా సాధ్యమైందని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె తన ఛాంబర్లో మండలంలోని అన్నిగ్రామాల ఎంపీటీసీలకు మండల నిధులనుండి గ్రామాల్లోని అభివృద్ధి పనులకు 15వ ఫైనాన్స్ ద్వారా రెండు లక్షల చొప్పున ప్రొసీడింగ్ కాపీలను అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే ధేయంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డికి సమస్యలను విన్నవించగా కాదనకుండా నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి సహకారం అందిస్తున్నారని అన్నారు. నిధులు అందించిన ఎమ్మెల్యే గోవర్ధన్‌కు, సహకరించిన జెడ్పిటిసి జగన్‌కు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గుగులోత్ స్వామి, పెండ గంగాధర్, సభావత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన వాసవి సేవాదళ్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వాసవి సేవాదళ్ సభ్యులు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కె ఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వాసవి సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి రాజు మాట్లాడుతూ.. సీపీ నాగరాజు ఎంతో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో పనిచేసే రోజుల్లో మృత్యువు అంచు వరకు వెళ్లి వచ్చారని ఆయన అన్నారు. యువత సిపి నాగరాజును ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ మార ప్రభు, సేవాదళ్ కార్యదర్శి విశ్వనాథం సూర్య ప్రకాష్, కోశాధికారి నూకల రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పోడు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

- అఖిలభారత రైతుకూలీ సంఘం
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పోడు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య అన్నారు. అటవీ సంరక్షణ నియమాలు 2022ను వెంటనే ఉపసంహరించుకోవాలని, పోడు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వేల్పూరు భూమయ్య మాట్లాడుతూ.. 50 సంవత్సరాలుగా ఆదివాసి, గిరిజన, దళిత, పేద ప్రజలు సాగు చేసుకుంటున్న భూముల నుండి బేదాఖలు చేయించే కుట్రను నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తుందని అన్నారు. పోడు భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే యత్నం మోడీ సర్కార్ చేస్తుందని ఆయన ఆరోపించారు. జిల్లాలో వేలాది ఎకరాలు పార్ట్" బి "లో ఉన్న రైతులకు కొత్త పాసు బుక్కులు ఇవ్వాలని, రైతుబంధును అందజేయాలని ఆయన కలెక్టర్ ను కోరారు. సిరికొండలోని 532 సర్వే నెంబరు, గడ్కోల్‌లో 100 సర్వే నెంబర్లు గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన ఫారెస్ట్ అధికారులు అడుగడుగున ఆటంకాలు కల్పిస్తున్నారని, హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారని ఆయన అన్నారు. మెంట్రాజ్ పల్లి 246 సర్వే నెంబర్లో పట్టాలు పొందిన వారికి ఆటంకాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ పాస్ బుక్కులు వెంటనే ఇవ్వాలని, ధరణి పోర్టల్‌లో అనేక అవకతవకలు ఉన్నందున వాటిని రద్దు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గు ఎర్రన్న, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు దేవ స్వామి, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు సాయి రెడ్డి, ఏఐకేఎంఎస్ నాయకులు చిన్నయ్య, గోపాల్, రాగుట్ల బాబురావు, సాయిలు, గంగాధర్, ఏ.చిన్నయ్య, బుచ్చన్న ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువతకు ఉపయోగపడే అంశాలు పొందుపరచడం అభినందనీయం

- సబ్ జడ్జి నసీమా సుల్తానా

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు, యువతకు ఉపయోగపడే అంశాలు పొందుపరిచి పుస్తక రూపంలో అందజేయడం అభినందనీయమని సబ్ జడ్జి నసీమా సుల్తానా అన్నారు. పట్టణానికి చెందిన సామాజిక సేవకులు పట్వారి తులసి కుమార్ స్వయంగా రూపొందించిన 75 ఆజాది అమృత్ మహోత్సవ స్వాతంత్ర అంశాల సేకరణ చరిత్ర పుస్తకాన్ని మంగళవారం పట్టణంలోని న్యాయస్థానంలో మర్యాదపూర్వకంగా కలిసి వారికి సన్మానించి అందజేశారు. సబ్ జడ్జి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమయంలో జరిగిన అంశాలను నేటి సమాజంలోని విద్యార్థులకు, యువతకు అవసరమయ్యే విధంగా ఒకే పుస్తక రూపంలో పొందుపరచడం అభినందనీయమని అన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు వివరించి వారి లైబ్రరీలో పొందుపరచాలని అన్నారు. సేవలు ఇలాగే కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు మాజీ అధ్యక్షులు చిలుక కిష్టయ్య సీనియర్ న్యాయవాదులు భూపతి రెడ్డి, గంట సదానందం రమేష్, అమితాబ్ కిరాడ్ న్యాయస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని అందజేస్తున్న తులసి పట్వారీ

చలో హైదరాబాద్‌లో పాల్గొన్న అంగన్వాడీ ఉద్యోగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు నెలకు 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెన్షన్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను కల్పించాలని డిమాండ్‌తో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ అంగన్వాడీ ఉద్యోగులు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, డిచ్‌పల్లి, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ ప్రాజెక్టుల నుండి అంగన్వాడీ ఉద్యోగులు తరలివెళ్లారు. పోరాటాలలో తమ హక్కులను సాధించుకుంటామని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే మార్చి నెలలో పెద్ద ఎత్తున సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పి స్వర్ణ, చంద్రకళ, ఈ మంగాదేవి, శివరాజమ్మ, వాణి, సూర్య కళ, జ్యోతి, గోదావరి, లక్ష్మి, గంగామణి తదితరులతోపాటు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



ఖచ్చితమైన సమయపాలనతో విజయం సాధ్యం

- రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి, జాతీయ సైకియాట్రిక్ సొసైటీ డైరెక్ట్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఆకుల విశాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఖచ్చితమైన సమయపాలన నిచ్చితమైన మనసుతో విజయం సాధ్యమని రోటరీ క్లబ్ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి, జాతీయ సైకియాట్రిక్ సొసైటీ డైరెక్టర్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఆకుల విశాల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక చంద్రశేఖర్ నగర్ కాలనీలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కుమార్ గల్లీలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల ఒత్తిడిని జయించడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను అలాగే పెన్నులను అందించి పరీక్షలలో విజయం సాధించాలని ఆశీర్వదించారని క్లబ్ అధ్యక్షులు సతీష్ షాహ తెలిపారు. ఈ కార్యక్రమానికి వక్తగా రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ డైరెక్ట్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ డాక్టర్ ఆకుల విశాల్ హాజరై మాట్లాడారు. మన మనసు ఎల్లప్పుడు రెండు దారులను చూపెడుతుందని ఒక దారి మంచిదారి అయితే ఇంకొక దారి చెడు దారి అని అన్నారు. మంచిని ఎంచుకొని మన లక్ష్యాన్ని చేధించాలని, ఖచ్చితమైన సమయపాలనతో ముందుకు వెళ్ళినట్లయితే విజయం తప్పక అదే వస్తుందని అన్నారు. ఈ పరీక్షల సమయంలో పౌష్టిక ఆహారం ఆకుకూరలు పండ్లు వంటివి తీసుకోవడంవల్ల మెదడులో అన్ని రకాల ప్రోటీన్లు అంది ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరుస్తుందని తెలిపారు. తదనంతరం విద్యార్థులకు పరీక్షల అట్టలను పెన్నులను అందజేసి ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులతో కలిసి పుల్వామా దాడిలో మరణించిన వీర జవాన్లకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం, సిబ్బంది చంద్రశేఖర్, సురేష్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్యాడ్‌లను పంపిణీ చేసిన